

ఆరేళ్ల వయసులోనే జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు బాలిక ఎంపిక 7

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

- ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకూ పరీక్ష
- జిల్లావ్యాప్తంగా 142 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 28,963 మంది విద్యార్థులు
- పటిష్టంగా ఏర్పాట్లు: జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్



పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(పాత చిత్రం)

కాకినాడ రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. విద్యార్థులను పరీక్షాహాల్లోకి ఉదయం 8.45 గంటలనుంచి 9.30 గంటల వరకూ అనుమతిస్తారన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటలనుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగుతాయని తెలిపారు. కాకినాడ జిల్లాలో ఈ పరీక్షలకు 142 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాసేందుకు 28,963మంది విద్యార్థులు హాజరు కానుండగా వారిలో 14,646మంది బాలురు, 14,317మంది బాలికలు ఉన్నారన్నారు. విద్యార్థులు తమతోపాటు హాల్ టికెట్లను తీసుకువెళ్లాలని పరీక్షల నిర్వహణకు సంబంధించి ఆరుగురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, 24 సిట్టింగ్ స్క్వాడ్‌లను, 142మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 142మంది డీవోలను నియమించామన్నారు. పరీక్షలు ఈనెల 31వరకూ జరుగుతాయని విద్యార్థులు తమ వెంట ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు.

● సార్వత్రిక విద్య పది పరీక్షలు

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా నిర్వహించే ఓపెన్ స్కూల్(సార్వత్రిక విద్య) పదో తరగతి పరీక్షలు కూడా సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు కూడా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగుతాయని డీఈవో పి.రమేష్ తెలిపారు. జిల్లాలో ఏర్పాటుచేసిన 26 పరీక్షాకేంద్రాల్లో 2248మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ఈ పరీక్షలు 27 వరకూ జరుగతాయని సార్వత్రిక విద్య జిల్లా సమన్వయకర్త పి.సాయి వెంకటరమణ తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విద్యార్థులకుఏమైనా సందేహాలుంటే 90003 99069 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని, విద్యార్థులు తమ హాల్‌టికెట్లను bse.ap.gov.in వెబ్‌సైట్‌నుంచి పొందవచ్చని హాల్‌టికెట్‌పై హెచ్‌ఎం సంతకం, స్టాంప్ లేకపోయినా పరీక్షలకు అనుమతిస్తారన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే పరీక్షా కేంద్రాల వైపు వెళ్లే బస్సుల్లో ఆర్టీసీ ఉచిత ప్రయాణ సదుపాయం ఏర్పాటు చేసిందన్నారు.



స్థానిక సంస్థలకు కూటమి తీపికబురు

- ప్రభుత్వం ఆర్థిక స్వేచ్ఛ
- ఎవరివి వారే ఖర్చు చేసుకోవచ్చు
- బిల్డింగ్ ప్లాన్స్ మునిసిపాలిటీకే
- పదేళ్ల ఇబ్బందులకు చెల్లుచీటి

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 16(ఆంధ్రజ్యోతి) : కూటమిలో స్థానికతకు పట్టం కట్టారు..ఆర్థిక స్వేచ్ఛకు ఊతమిచ్చారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ చొరవతో మునిసిపాలిటీల ఎన్నో ఏళ్ల కల సాకారమైంది.రాష్ట్రంలోని నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలు,నగర పంచాయతీలకు ఆర్థిక స్వాతంత్ర్య లభించింది. ఇకపై చెత్త తొలగించాలన్నా, నీటి కుళాయి మరమ్మతు చేయాలన్నా, వీధి లైటు వేయాలన్నా, రోడ్లపై గుంతలు పూడ్చాలన్నా, నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వైపు చూసే దయనీయ స్థితి తప్పింది. రాష్ట్రంలో పదేళ్లగా మునిసిపాలిటీల ఆదాయంలో ప్రతి పైసా సీజేఎఫ్‌ఎస్‌లో జమచేసేవారు. స్థానిక అవసరాలకు నిధులు రాబట్టుకోవడం అనేది సీజేఎఫ్‌ఎస్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేది. పన్నుల ద్వారా మునిసిపాలిటీలకు వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకునేది. స్థానిక సమస్యల పరిష్కారానికి నిధులు ఉండేవి కావు.కరోనా సమయంలో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు

అసెంబ్లీలో ఆర్థిక బిల్లు ఆమోదం

స్థానిక అవసరాలకు ఖర్చు చేసుకున్న నిధులు తమ ఆదాయం నుంచి విడుదల చేయాలని మునిసిపాలిటీలు రెండేళ్ల కిందట పెట్టుకున్న బిల్లులకు ఇప్పటి వరకు మోక్షం లేదు. దీంతో మునిసిపాలిటీలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. నిజానికి 73,74 రాజ్యాంగ సవరణ ప్రకారం స్థానిక సంస్థలకు 29 అధికారాలు ఇవ్వాలని నిర్ణయం జరిగింది. ఎమ్మెల్యేలు నిధులపై ఆధిపత్యం కోసం పంచాయతీలు, మునిసిపాలిటీలకు అధికారాలు బదలాయించడం లేదు.దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి.దేశంలో స్థానిక సంస్థలకు అధికారాలను బదలాయించిన రాష్ట్రంగా కేరళ మొదటి స్థానంలో ఉంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆ బాటలో నడుస్తోంది. మునిసిపల్ శాఖ మంత్రిగా నారాయణ బాధ్యతలు చేపట్టడంతో ఆయన పాత ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.మునిసిపాలిటీలు బాగుపడాలంటే వాటికి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమని వాటి ఆదాయాన్ని వాటి వద్దే ఉంచాలని ఆయన ప్రభుత్వ పెద్దలను ఒప్పించగలిగారు.దీంతో మునిసిపాలిటీలకు ఆర్థిక స్వాతంత్ర్యం బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందింది. మున్సిపాల్టీలకు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం స్థానిక సంస్థల వద్దే ఉంటుంది.అవసరాలకు ఖర్చు చేసుకునే అధికారం ఉంటుంది.

ప్లాన్ అప్రూవల్ సరళతరం

ఈ కొత్త బిల్లులో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌ను సరళతరం చేయడంతో పాటు ఉల్లంఘనలు జరిగితే చర్యలు తీసుకోవడానికి వీలుగా చట్టం చేశారు. ఇప్పటి వరకు మునిసిపాలిటీల్లో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌కు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి పంపేవారు. ఇప్పుడు దాన్ని రద్దు చేశారు. మునిసిపాలిటీలే నేరుగా అప్రూవల్ ఇచ్చే వెసులుబాటు కల్పించారు. దీని వల్ల అప్రూవల్స్ వేగవంతమవుతాయి. ప్లాన్ ఉల్లంఘించి నిర్మాణాలు జరిగితే వాటిని కూల్చే అధికారం మునిసిపాలిటీలకు ఇచ్చారు. అందుకు అంగీకరిస్తూ భవన యజమాని అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుంది. దీని వల్ల నిర్మాణాల్లో ఉల్లంఘనలు కట్టడి కానున్నాయి.

2019లోనే ప్రతిపాదన..

స్థానిక సంస్థలకు ఎన్నో అవసరాలు ఉంటాయి.. నిధుల్లేకపోతే ఇబ్బందే. ఈ మేరకు మొదట 2014-19లో మునిసిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన పొంగూరు నారాయణ వారి నిధులు వారివద్దే ఉంచాలనే ప్రతిపాదన ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లారు. అప్పటికే ఎన్నికల సమయం దగ్గరపడడంతో ఈ ప్రతిపాదనలు మూలనపడ్డాయి.దీంతో గత ఐదేళ్ల పాత పద్ధతే కొనసాగింది. పన్నుల రూపంలో వచ్చిన మునిసిపాలిటీల ఆదాయాన్ని గత వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకోవడంతో గడిచిన ఐదేళ్ల పురపాలికలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. మునిసిపాలిటీల్లో పనులకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేవారు కాదు.ఈ కారణంగానే ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లో గత ఐదేళ్లలో రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చలేకపోయారు.



చికెన్ ముక్క దిగదు.. మటన్ ధర మాట వినదు..

- మటన్‌లో..బోలెడు మోళీలు
- 90 శాతం గొర్రె మాంసమే విక్రయం
- బర్డ్ ఫ్లూతో తగ్గిన చికెన్ వినియోగం
- అమాంతం పెంచేస్తున్న ధరలు
- మొన్నటి వరకూ కిలో రూ.800
- ఇప్పుడు రూ.1300
- ఎక్కువ నిల్వ మాంసమే అమ్మకం
- మామూళ్ల మత్తులో..తనిఖీల్లేవ్
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- పట్టణాలు.. గ్రామాల్లోనూ ఇంతే

ఆదివారం వచ్చిందంటే ముక్కలేనిదే ముద్ద దిగదు.. కంచంలో చికెన్ ముక్క.. లేదంటే చేప ముక్క డబ్బులు ఎక్కువగా ఉంటే మటన్ ముక్క ఉండాల్సిందే.. అయితే బర్డ్ ఫ్లూ కారణంగా చాలా మంది చికెన్‌కు దూరంగా ఉంటున్నారు.. కోళ్ల వ్యర్థాలను చేపలకు వేస్తున్నారని తెలిసిన వాళ్లు అవీ తినేందుకు ఇష్టపడంలేదు.. ఇక మిగిలింది మటన్ ఒకటే.. దీంతో జనం చికెన్.. ఫిష్ వదిలేసి.. మటన్ వైపు చూస్తున్నారు.. షాపుల ఎదుట క్యూ కడుతున్నారు.. మరి మటన్ అయినా నాణ్యతగా ఉంటుందా అంటే అదీ అనుమానమే.. ఎందుకంటే ఎక్కడా తనిఖీల్లేవ్.. నిల్వ మాంసం విక్రయించినా పట్టించుకునేవారే లేరు.. మేక మాంసం అని అడిగితే గొర్రె మాంసం అంటగట్టేసినా అడిగేవారులేరు.. దీంతో వ్యాపారుల ఇష్టానుసారంగా మారిపోయింది.. ధరలపై నియంత్రణ లేదు.. తనిఖీలు లేవు.. ఇచ్చుకో.. అమ్ముకో అనే రీతిన ఉంది పరిస్థితి..

కార్పొరేషన్(కాకినాడ)/రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)

బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ తినేందుకు జనం ఇష్టపడంలేదు.. ఒకనాడు ఆదివారం వచ్చిందంటే చికెన్ షాపులు జనంతో కిటకిటలాడేవి.. మరి నేడు అటువైపు కన్నెత్తి చూసేందుకు సాహసించడంలేదు..వైద్యులు ఊడికించిన చికెన్ తిన్నా ఇబ్బందిలేదన్నా ఎందుకో దూరం పెట్టారు. చాలా తక్కువ శాతం మంది మాత్రమే ఇప్పుడిప్పుడే చికెన్ కొనుగోలు చేస్తున్నారు.. దీంతో ఇప్పుడు చూపంతా మటన్ వైపే ఉంది. దీంతో ధర అమాంతం పెంచేశారు. దీంతో మాంసాహార ప్రియులు హుష్ అంటూ నిట్టూరుస్తున్నారు.కోళ్లకు బర్డ్‌ఫ్లూ పుణ్యమాని.. మటన్ ధర అమాంతం పెరిగిపోయింది.. ఇదిలా ఉండగా సందట్లో సడేమియా అన్నట్టు మేక, గొర్రెల



మాంసంపై తనిఖీలు కరువయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వినియోగం పెరిగినా ..అధిక శాతం జనం మోసపోతూనే ఉన్నారు. మటన్ ధరలు ఇంకా పెరగవచ్చనే అంచనాల నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

అమాంతం మటన్ ధర పెంపు

ఉమ్మడి తూర్పులో సుమారు 5 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయని కాగితాలపై లెక్కలు చెబుతున్నా మటన్ ధర దూసుకుపోతోంది.. బర్డ్ ఫ్లూ కారణంగా జనం చికెన్ వైపు చూడడానికే ఇష్టపడంలేదు. దీంతో ప్రతి ఆదివారం మటన్ అమ్మకాలు పెరిగాయి.ఈ నేపథ్యంలో ఇష్టానుసారం ధరలు పెంచేస్తున్నా నియంత్రణే కరువైంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ స్లాటర్ హౌస్‌లలో ఆదివారం సుమారు 2 వేల గొర్రెలు, మేకలను వధిస్తున్నారు. మిగతా రోజుల్లో ఆ సంఖ్య 500 ఉంటుంది. ఉమ్మడి తూర్పులో నెలకు సుమారు 200 టన్నుల వరకూ అమ్మకాలు ఉండే మటన్ అమాంతంగా 500 టన్నుల వరకూ పెరిగింది.దీంతో ఒక్కసారిగా ధరలు పెంచేశారు.నెల కిందట వరకూ కిలో రూ.800 ఉండే ధర ఇప్పుడు గరిష్ఠంగా రూ. 1000 నుంచి రూ.1300కి చేరింది. అంటే వంద గ్రాములు కావాలంటే రూ.130 వెచ్చించాల్సిందే. ఇక శాల్తీలు కావాలంటే వామ్మో అనాల్సిందే. టిల్లీ ఒకటి రూ.200 (50-100గ్రాములు ఉంటుంది), దబ్బ(లంగ్స్) రూ.120, బోటీకి రూ.300, లివర్ కిలో రూ.1500 చెల్లించాల్సిందే. దుమ్ములను కూడా కిలో రూ.800కి అమ్ముతున్నారు. బాలింతలకు మటన్ దూరమైపోయింది.

మటన్ ధరపై నియంత్రణేది..

ఉమ్మడి జిల్లాలోని మాంసం విక్రయ దారులకు లోకల్‌గా మేకలు,గొర్రెల లభ్యత సరిపోవడం లేదు. దీంతో శ్రీశైలం, కర్నూలు జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని షోలాపూర్, కర్ణాటకలోని బళ్లారి ప్రాంతాల్లో జరిగే సంతలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు.దీంతో రవాణా చార్జీలు వినియోగదారులు భరించక తప్పడం లేదు. ధరల నియంత్రణపై యంత్రాంగం దృష్టి పెట్టడం లేదు.ఉమ్మడి జిల్లాలో 5 లక్షల వరకూ గొర్రెలు, మేకలు ఉన్నాయని లెక్కలు చెబుతున్నా వాస్తవంలో అలా లేదు.డిమాండ్ కు తగిన ఉత్పత్తి లేక వ్యాపారులు ధరలను పెంచేస్తున్నారు. అధికారులు అదుపు చేయలేకపోతున్నారు.

ఏది తింటే బెటర్..

ఇటీవల అమ్మకాలు పెరగడంతో గొర్రె తోకకు నల్లరంగు పూసి మేక మాంసమని అమ్ముతున్నారు. దీనిని జాగ్రత్తగా గమనించుకోవాలి. ఒకవేళ బాగా నిల్వ చేసి ఉంటే మాంసం కొట్టే సమయంలో జిగురులా వస్తుంది. మేక మాంసంలో కొవ్వు శాతం తక్కువగా..ప్రొటీన్ ఎక్కువగా ఉంటే గొర్రెలో కొవ్వు ఎక్కువగా ప్రొటీన్ తక్కువగా ఉంటుంది.ఐరన్ కూడా మేక లో అధికం. గుండె, కొలెస్ట్రాల్ ఇబ్బందులు ఇన్న వాళ్లు గొర్రె తినకపోవడమే మంచిది. జీర్ణ సమస్యలు ఉన్నవాళ్లకు గొర్రె బెటర్. తలకాయ, కాళ్లు, శాల్తీల విషయంలో ఎవరిష్టం వారిది. తలకాయలు, కాళ్లకూ ఈ మధ్య గిరాకీ పెరిగింది.దీంతో ఐస్‌లో ఎక్కువ రోజులు నిల్వ చేసినవి అమ్మేస్తున్నారు. గొర్రె తలకాయలను మేకవని విక్రయిస్తున్నారు.తేడా తెలుసుకోవడానికి చిన్న లాజిక్ ఉంది. గొర్రె తలకాయలోని కళ్ల కింద చిన్న సొట్టలు ఉంటాయి. మేకకు ఉండవు.

90 శాతం గొర్రె మాంసమే..



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న మటన్‌లో 90 శాతం గొర్రె మాంసమే ఉం టోంది. మేక మాంసం చాలా తక్కువగా లభ్యమవుతోంది. గొర్రెల పెంపకమే ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో గొర్రెల సంతలే జరుగుతాయి. మేకల సంతలు అత్యంత అరుదుగా ఉంటాయి. దీంతో మేక మాంసం అని చెబుతూ గొర్రె మాంసాన్ని విక్రయిస్తున్నారు. మేక, గొర్రె మాంసం అమ్మకాలపై ఎలాంటి తనిఖీలు, చర్యలూ, ధరల నియంత్రణా లేదు. ఒక కిలో మాంసం ఎలా ఉండాలనే నిబంధనలేమీ లేవు.దీంతో ఇష్టానుసారం అమ్మకాలు సాగిస్తున్నారు. ధరల పట్టిక షాపుల వద్ద కనిపించడం లేదు.

జబ్బు పడినవీ కొనుగోలు..

సంతల్లో జబ్బుపడిన మేకలు,గొర్రెలు 70 శాతం తక్కువకు విక్రయిస్తుంటే విక్రయదారులు కొనుగోలు చేస్తారు. రవాణాలోనే చనిపోతే కోసేసి మాంసాన్ని ఐస్ బాక్సులో వేసి తీసుకొస్తారు. రాజమహేంద్రవరం జాంపేట, కాకినాడ,అమలాపురంలోని ప్రధాన మాంసాహార మార్కెట్లలో అర్థరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున 3 గంటల మధ్యలో దింపుతారు.వధించడానికి అనువుగా లేని మేకలున్నా కమేళాలో కాస్త సొమ్ము ముట్టజెప్పి పనికానిచ్చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇక రౌండ్ సీల్‌ని కొందరు బడా వ్యాపారులు చట్టానికి విరుద్ధంగా తయారు చేయించుకొని.. షాపు వద్ద కోసేసే జంతువులకు వాళ్లే రౌండ్ సీల్ వేస్తున్నారని చెబుతున్నారు.

అధికారుల తనిఖీల్లేవ్...

మాంసాభివృద్ధికి మీట్ కార్పొరేషన్ అం టూ ఓ శాఖే ఉంది.రాష్ట్ర వ్యాప్తంగా జాయింట్ డైరెక్టర్,ఇద్దరు ముగ్గురు సిబ్బంది ఉన్నారు.ఆ శాఖ ఏం చేస్తుందనేది జగమెరిగిన సత్యం. నిబంధనల ప్రకారం పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఏర్పాటు చేసుకొనే స్లాటర్ హౌస్‌లోనే వధ జరగాలి. వధకు ముందు పశువైద్యులు పరిశీలించి ఆ జంతువుకు ఎలాంటి రోగాల్లేవని, తినడానికి అనుకూలమేనని ధ్రువపరచాలి. మాంసంపై కూడా స్టాంప్ వేస్తారు.ఎక్కడపడితే అక్కడే కోసేస్తున్నా అధికారులకు కనిపించడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చూస్తే ఇప్పటి వరకూ అధికారులు తనిఖీలు చేసిన ఘటనలే లేవంటే అతిశయోక్తి కాదు.



చికెన్ తినలేక..!

ఇటీవల బర్డ్ ఫ్లూ కలకలం రేపిన సంగతి తెలిసిందే. దీంతో చికెన్ వినియోగం బాగా తగ్గింది. మార్కెట్‌లో మాంసం అవసరతలో 70 శాతం చికెన్ తీర్చేది. ఇప్పుడు చికెన్ వినియోగం తగ్గడం, చనిపోయిన కోళ్లను, కోళ్ల వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేస్తున్నారనే విషయం బయటకు రావడం వల్ల చేపలను తినడానికీ వెనుకాడుతున్నారు. ఈ ప్రభావం మటన్‌పై పడి విపరీతంగా వినియోగం పెరిగిపోయింది. దీంతో ధరలు పెంచేశారు. చికెన్ తినలేక.. మటన్ కొనలేక సామాన్యులు అల్లాడిపోతున్నారు.

పొట్టిశ్రీరాములు ఆశయాలు.. నేటి తరానికి ఆదర్శం కావాలి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్

కాకినాడ సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పోరాట పటిమ, కార్యదీక్షతగల పొట్టి శ్రీరాములు ఆశయాలు నేటి తరానికి ఆదర్శం కావాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా కాకినాడలోని సీబీఎం కూడలిలో పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి మంత్రి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం ఆంధ్ర రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఆమరణ దీక్ష చేసి అశువులు బాసిన మహనీయుడన్నారు. ఆనాటి ఆయన త్యాగఫలమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అన్నారు. 58రోజులపాటు ఆమరణ దీక్ష చేసి తన ప్రాణాలను తృణప్రాయంగా విడిచిన త్యాగమూర్తి అని కొనియాడారు. పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారిణి లల్లి, ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్

మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి: ఎస్పీ

కాకినాడ క్రైం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): దేశభక్తులు, స్వాతంత్ర్య సమరయోధులు వంటి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాన్నే తృణంగా పెట్టిన అమరజీవి పొట్టి శ్రీరాములని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎంజేవి భాస్కరరావు, డీఎస్పీ ఏఆర్ శ్రీహరిరావు పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

పోలవరం పనులకు తొలగిన అడ్డంకులు

- భూసమస్యలపై అధికారుల చర్చలు సఫలం
- తుని వద్ద శరవేగంగా పోలవరం పనులు



తుని మండలం తాళ్లూరు-కుమ్మరిలోవ మధ్య కాలువ నిర్మాణంలో భాగంగా తొలగిస్తున్న కొండ

తుని రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పోలవరంప్రాజెక్టు పనులకు కదలిక వచ్చింది. ప్రాజెక్టు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు హామీ నెరవేర్చే దిశగా అడుగులు పడుతున్నాయి. పోలవరం ఎడమ కాలువ నిర్మాణానికి పీఐపీఎల్‌ఎంసీ పనుల పునరుద్ధరణకు మంత్రి మండలి ఆమోదం తెలిపిన వెంటనే రూ.960కోట్లు నిధులు మంజూరు చేయడంతో జలవనరులశాఖ గుత్తేదారులకు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది.

● నిర్మాణ పనులు ఇలా..

పోలవరం ఎడమ ప్రధాన కాలువ రూ.4202.69కోట్లతో అంచనా వ్యయంతో పూర్తి చేయాల్సి ఉంటే రూ.2987.44కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో రివర్స్ టెండరింగ్ విధానం ప్రాజెక్టుకు శాపంగా మారడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో పనులు చేపడుతున్న గుత్తేదారులు ఎఎర్త్ వర్క్, లైనింగ్ కాంక్రీట్ చేయాల్సి ఉంది. దీంతో డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ సిస్టమ్, టోపోగ్రాఫికల్ సర్వే పూర్తి చేసి జాతీయ రహదారి క్రాసింగ్, కాంక్రీట్ ఇతరత్ర పనులు కొలిక్కి తెచ్చే దిశగా కాంట్రాక్టర్లు పనులు చేపడుతున్నారు. ప్యాకేజీ-5లో తుని మండలం కుమ్మరిలోవవద్ద 12ఎకరాలు, ప్యాకేజీ8లో కొత్త నీటిపారుదల కాలువ నిర్మాణం కోసం 32ఎకరాల భూసేకరణపై అధికార యంత్రాంగం రైతులతో చర్చలు జరిపి అడ్డంకులు తొలగించే దిశగా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే కుమ్మరిలోవలో భూములు, ఇళ్లు కోల్పోయిన రైతుల కుటుంబాలతో చర్చలు సఫలమై పరిహార నిధులు విడుదల చేయడంతో తునివద్ద అడ్డంకులు తొలిగాయి. దీంతో తుని రూరల్‌లో తాళ్లూరు, కుమ్మరిలోవ, గవరపేట, తొండంగి మండలంలో బెండపూడి తదితర ప్రాంతాల్లో పోలవరం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పోలవరం ఎడమ కాలువ నిర్మాణం పూర్తయితే కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లా, అనకాపల్లి జిల్లాలో 4లక్షల ఎకరాలకు సాగునీరు అందుతాయి. ఉమ్మడి జిల్లాల్లో 2.50లక్షల ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలం కానుంది. విశాఖలోని తాగునీటి, పారిశ్రామిక అవసరాలకు 23.44టీఎంసీల నీరు అందతుంది.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జిల్లా స్థాయిలో కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదలచేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలన్నారు.

అన్నవరం దేవస్థానంలో అపచారం
- సత్యనికేతన్ సత్రంలో ఈవో ఆకస్మిక తనిఖీలు
- మద్యం సీసాలు లభ్యం
మెయిన్‌లో..

కార్మికుల భద్రత.. నా బాధ్యత
- కాకినాడలో 54వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో కార్మిక శాఖ మంత్రి సుభాష్
- కార్మికుల భద్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ
7



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

ఉద్యోగం చేసుకోమన్నందుకు.. కన్న తల్లినే హత్య చేసిన కుమారుడు
- కాకినాడ 48వ డివిజన్ ఎస్.అచ్చుతాపురంలో ఘటన
మెయిన్‌లో..

పిల్లల చదువుపై కలతతోనే!
- ఇద్దరు పిల్లల్ని చంపి.. ఆపై తండ్రి ఆత్మహత్య ఘటన
- సైకలాజికల్ డిజార్డర్‌తోనే హత్యలు.. నిర్ధారించిన పోలీసులు

వేసవి వచ్చేసింది.. ఏం చేద్దాం!




వేసవి వచ్చేసింది.. ఎండలు మండిపోతున్నాయి.. మరోపక్క చెరువులు ఎండిపోతున్నాయి.. అధికారులు ఈపాటికే చెరువులు నింపడం.. దాహార్తిని తీర్చడంపై సమీక్షలు జరిపాలి.. కానీ ఇప్పటికీ అటువంటి చర్యలే లేవు.. నీటి ఎద్దడి వచ్చినా మేం ఏదో ఒక చోటకు ఎగిరెళ్లి దాహం తీర్చుకుంటాం.. మీ గురించి ఆలోచిస్తుంటేనే బాధగా ఉంది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టుగా.. కొంగలు.. గేదెలు కలిసి దివాన్‌చెరువులోని ఒక చెరువులో సమావేశమై వేసవిని ఎలా అధిగమించాలనేదానిపై చర్చిస్తున్నట్టు ఉంది కదూ ఈ చిత్రం..

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ఎగిరిపోతే.. ఎంత బావుంటుంది!



కాకినాడ రూరల్ వలసపాకల శివారులో మేత తింటూ.. గాల్లోకి ఎగురుతూ.. సందడి చేస్తున్న కొంగలు



ఎగిరిపోతే ఎంత బావుంటుంది.. అన్నట్టుగా అప్పటివరకు ఎండు చేపలు ఆహారంగా తీసుకుని.. ఆకలి తీర్చుకుని హాయిగా గగనంలోకి ఎగిరిపోతున్న కొంగలు

- ఫొటోగ్రాఫర్, కాకినాడ

భళా.. బాలిక!

ఆరేళ్లప్రాయంలోనే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



సాధన చేస్తున్న చిన్నారి నిత్యశ్రీ

పిఠాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లప్రాయంలోనే ఆ చిన్నారి విశేష ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆర్చరీ పోటీల్లో చూపించిన ప్రతిభ ఆధారంగా అండర్ 10 పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెం గ్రామానికి చెందిన ముమ్మిడి నిత్యశ్రీ వయస్సు ఆరేళ్లు. చిన్ననాటి నుంచి ఆర్చరీపై ఆసక్తి ఉండటంతో కోచ్ పి.లక్ష్మణరావు ఆమెకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. ఇటీవల నిత్యశ్రీ పలు జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా అండర్ 10 కేటగిరిలో అత్యధిక స్కోరు సాధించింది. ఈ చిన్నారి ప్రతిభను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఏపీ జట్టుకు ఎంపిక చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ సమాచారం ఇచ్చారు. గుంటూరు జిల్లాలోని నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే ఆరవ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలు అండర్ 10 ఇండియన్ రౌండ్ కేటగిరి బాలికల విభాగంలో నిత్యశ్రీ ఏపీకి ప్రాతినిధ్యం వహించనున్నది. ఈమె ప్రస్తుతం కోచ్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతోంది. నిత్యశ్రీ ఆదిత్య స్కూలులో యూకేజీ చదువుతోంది. చిన్నారిని స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాసకుమార్, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం తదితరులు అభినందించారు.

మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్‌కు మాతృ వియోగం



అనంత లక్ష్మి(ఫైల్)

మండపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రుశ్రీవరప్రకాష్ తల్లి చుండ్రు అనంతలక్ష్మి(70) (అమ్ములు) ఆదివారం తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. గతకొంత కాలం నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆమె ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆదివారం తెల్లవారుజామున మరోసారి గుండెపోటు రావడంతో వైద్యులను పరిశీలించి మృతిచెందారని ధ్రువీకరించారు. అనంతలక్ష్మికి భర్త చుండ్రు గోవిందరాజులు, కూమార్తె లావణ్య, కూమారుడు చుండ్రుశ్రీవరప్రకాష్ ఉన్నారు. ప్రకాష్ అభి మానులు, అనుచరులు ఆయన నివాసానికి చేరుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతలక్ష్మి అంత్యక్రియలను ఆదివారం కటుంబ సభ్యులు, అభిమానుల నడుమ మండపేటలోని రుద్రభూమిలో నిర్వహించారు.

కార్మికుల భద్రత నా బాధ్యత

● మంత్రి వాసంశెట్టి సుభాష్ ● కాకినాడలో 54వ జాతీయ భద్రత వారోత్సవాలు



రైసుమిల్లుల్లో భద్రతా చర్యలపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

కాకినాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రత తన బాధ్యత అని, వారు భద్రంగా, ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం భద్రంగా ఉంటుందని, వారి భద్రతతోనే వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారమవుతుందని కార్మిక ఫ్యాక్టరీస్, బాయిలర్స్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్ శాఖల మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం వాకలపూడి, పెద్దాపురం ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 54వ జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని కాకినాడలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిపిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కోరమండల్, ఓఎన్‌జీసీ, రిలయన్స్, జెమిని ఎడిబుల్ ఆయిల్స్ రైస్ మిల్స్ అసోసియేషన్ ఇతర వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న సిబ్బంది, కార్మికులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఎంటీ హాలు ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి ప్రారంభించి పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రైసుమిల్లుల్లో భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నా కార్మిక కుటుంబ సభ్యులందరినీ నేరుగా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్మికుల భద్రత, ఆరోగ్యం పట్ల యాజమాన్యాలు మరింత బాధ్యత తీసుకోవాలన్నారు. భద్రత నియమాలను సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేలా స్థానిక భాషల్లో రూపొందించాలని మంత్రి సూచించారు. రసాయన పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు రసాయనాల పట్ల, వాటి వల్ల కలిగే ప్రమాదాల పట్ల శిక్షణ తరగతులు నిర్వహించాలని, ప్రమాదాలను పసిగట్టి నివారించే టెక్నాలజీని వాడుకోవాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం చంద్రబాబు వసుధా మిశ్రా నేతృత్వంలో కమిటీ వేశారని, ఆ కమిటీ రిపోర్టు ఆధారంగా అన్ని భద్రతా చర్యలను తూ.చతప్పకుండా పాటించాలన్నారు. యాజమాన్యాలు, కార్మికులు ప్రభు త్వ యంత్రాంగం కలిసి జీరో యాక్సిడెంట్ అనే నినాదంతో ముందుకెళ్లాలని మంత్రి కోరారు. కార్మికలోకపు కల్యాణానికి, శ్రామికలోకపు సౌభాగ్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాకినాడలో బధిర విద్యార్థులను దత్తత తీసుకోవడంతో పాటు భవన మరమ్మతులు, అదనపు గదినిర్మాణానికి ముందుకు వచ్చిన జెమినీ ఎడిబుల్స్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. వివిధ పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఫ్యాక్టరీస్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ వర్మ, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, కాకినాడ జిల్లా అగ్నిమాపక అధికారి పీవీఎస్ రాజేశ్, జిల్లా ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ డి.రాధాకృష్ణ, ఇన్‌స్పెక్టర మురళీకృష్ణ, జిల్లా కార్మికశాఖ అదనపు కమిషనర్ బుల్లిరాణి, పరిశ్రమలశాఖ జీఎం సీహెచ్ గణపతి, జిల్లా బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

అల్లూరి జిల్లా గంగవరం వద్ద ఘటన




మృతులు కొర్రపు శ్రీనివాస్, గొర్లె శేఖర్



గాయాలపాలైన శేఖర్ భార్య, కొడుకు

వై.రామవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా గంగవరం మండలం గంగవరం గ్రామ శివారులో 216 జాతీయ రహదారి వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటనకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గంగవరం- అడ్డతీగల ప్రధాన రహదారిలో గల గంగవరం గ్రామ శివారులో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వై.రామవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో డేటా ఎంట్రీ ఆప రేటర్‌గా పనిచేస్తున్న గొర్లె శేఖర్(30), వై.రామవరం మండలం బూరుగుపాలెంకు చెందిన కొర్రపు శ్రీనివాస్(25) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు శేఖర్ భార్య హబీబీ, కుమారుడికి తీవ్రగాయాలు కావడంతో రంపచోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభు త్వాసుపత్రికి తరలించినట్టు గంగవరం ఎస్ఐ బి.వెంకటేష్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ట్రావెల్ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

కొత్తపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కొత్తపేట సమితి రోడ్డుకు చెందిన కోనాల రాఘవులు(72)ను ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం.. రాఘవులుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు కోనాల సత్యనారాయణ లారీ క్లీనర్‌గా పనిచేస్తూ బయట ప్రాంతంలో ఉంటున్నాడు. చూసేవారు లేక స్థానిక బోడిపాలెం వంతెన వద్ద ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద నివసిస్తున్నాడు. శనివారం రాత్రి అమలాపురం నుంచి వచ్చే ప్రవేట్ ట్రావెల్ బస్సు రాఘవులను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుమార్తె ఉండవల్లి వెంకటరమణ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియాఆసుపత్రికి తరలించిన్నట్టు చెప్పారు.



మృతి చెందిన కోనాల రాఘవులు

జేఎన్టీయూకేలో ముగిసిన టెక్ ఫెస్ట్




ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్‌తో నమూనాలు ప్రదర్శించిన బృందం



విద్యార్థినులు ఏర్పాటు చేసిన చేసిన ఎలక్ట్రికల్ వాహనాన్ని పరిశీలిస్తున్న వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో 2రోజులు జరిగిన జాతీయ స్థాయి సింపోజియం టెక్ ఫెస్ట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ప్రిన్సిపాల్ మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్ట్‌లు, పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, డ్రోన్ ప్రజంటేషన్, స్పాట్ ఈవెంట్స్‌ను సందర్శించి అభినందించారు. అనంతరం యూసీఈకే ప్రిన్సిపాల్ కార్యాలయ సెమినార్ హాల్లో రోబోటిక్ అప్లికేషన్ల కోసం కస్టమ్ ఎంబెడెడ్ బోర్డును అభివృద్ధి చేయడం అంశంపై నిర్వహించిన శిక్షణను పరిశీలించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు, ప్రతిభాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, హెచ్‌వోడీలు, వైస్ ప్రిన్సిపాల్స్ వర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులున్నారు.

టమోటా..ధర లేదట!



కిలో రూ.6, కోత ధర కూడా రావడంలేదని రైతుల గగ్గోలు

ఆలమూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): టమోటా రైతులకు పుట్టెడు కష్టాలు వచ్చిపడ్డాయి. ధర లేక దయనీయస్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. కోనసీమ జిల్లాలోని లంక పరివాహక ప్రాంతాల్లో టమోటా సాగు జోరుగా సాగుతుంది. ఈ పంట పూర్తిగా కాపు కొచ్చి అందుబాటులోకి వచ్చేసరికి ధర పూర్తిగా పడిపోయి కనీసం కోత కూలీ కూడా రాని దుస్థితి ఏర్పడింది. ఈ ఏడాది పంటకు అనుకూలంగా ఉండి దిగుబడులు గణనీయంగా రావడంతో ఒక్కసారిగా ధర పడిపోయి రైతులు అయోమయంలో పడ్డారు. అంతర్‌రాష్ట్ర మడికి కూరగాయల మార్కెట్లో 10 కిలోల టమోటో ధర రూ.60నుంచి 70 పలికింది. అంటే కిలో ధర రూ.6లు. ఈ ధరతో టమోటా కోసి మార్కెట్‌కు తరలించాలంటే కనీసం కిలోకి రూ.10 ఖర్చవుతుందని, దీంతో కోయడమే మానేయడం మంచిదని రైతులు వదిలేస్తున్నట్టు చెబుతున్నారు.

సాగు చేసి భారీగా నష్టపోయా



టమోటా సాగు ఆశాజనకంగా ఉంటుందని భారీగా పెటుబడి పెట్టి పంట సాగు చేశా. దిగుబడులు బాగా ఉన్నప్పటికీ కోత కూలీ రాక పంటభూమిలోనే కోయకుండా వదిలేయడం జరుగుతుంది. టమోటా సాగులో ఇంత దయనీయస్థితి మునుపెన్నడు చూడలేదు.

బి.సాయిబాబు, టమోటా రైతు, జొన్నాడ

శతాధిక వృద్ధురాలు సూర్యకాంతం మృతి



సూర్యకాంతం (ఫైల్)

అమలాపురం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన శతాధిక వృద్ధురాలు గొవ్వాల సూర్యకాంతం (110) అనారోగ్యంతో మృతిచెందారు. మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్‌కు ఆమె స్వయాన నానమ్మ. సూర్యకాంతంకు ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వారితో పాటు మనుమలు, ముని మనుములు 52మంది ఉన్నారు. ఆదివారం సూర్యకాంతం చిత్రపటానికి పలువురు రాజకీయ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

22 నుంచి గౌరీపట్నంలో నిర్మలగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు



మహోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏలూరు పీఠాధిపతి జయరావు

దేవరపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని నిర్మలగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్టు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో జయరావు మట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా నిర్మలగిరి పుణ్యక్షేత్రం ప్రణవిల్లుతుందన్నారు. పుణ్యక్షేత్రం ప్రారంభించి 40 ఏళ్ల అయ్యిందని, 2000 సంవత్సరంలో నిర్మలగిరి క్షేత్రంలో ప్రధాన దేవాలయం నిర్మించి 25 ఏళ్ల అయిన సందర్భంగా ఈ ఏడాది సిల్వర్ జూబ్లీ నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని, చిన్నారులు, వృద్ధులకు పాలు, మజ్జిగ అందజేస్తామన్నారు. పుణ్యక్షేత్రంలో నితాన్నదానం జరుగుతుందన్నారు. భక్తులకు శాంతి కలగడానికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నామని, పుణ్యక్షేత్రం సందర్శించిన భక్తులందరికీ ధైర్యం, మనశ్శాంతి కలుగుతాయన్నారు. ఉత్సవాల నిర్వహణకు 250మంది వలంటీర్లను ఏర్పాటు చేశామని, పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు నిర్వహిస్తారని, ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పుణ్యక్షేత్ర సందర్శనకు ఉభయ రాష్ట్రాల నుంచి పదిలక్షల వరకు భక్తులు వస్తారని తెలిపారు. జయరావును జాన్‌పీటర్, నితాన్నదాన కాంట్రాక్టర్ కళ్ళేపల్లి నాగేశ్వరరావు సత్కరించారు. రెవరెండ్ ఫాదర్లు పీ.బాల, డీ.ఆరోన్, తదితరులు ఉన్నారు.

కాపవరంలో ఎడ్ల పరుగు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ తుమ్మల బాబు

సామర్లకోట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కాపవరంలో ఆదివారం గ్రామ టీడీపీ నాయకులు కుంచం శ్రీను, చోడిశెట్టి దొరబాబు, సతీష్, కుంచం బాబ్జీ ఆధ్వర్యంలో రామలింగేశ్వరా రాష్ట్రస్థాయి సీనియర్, జూనియర్ ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి సు మారు 25జతల ఎడ్లు పాల్గొన్నాయి. విజేతలకు సీనియర్ విభాగంలో కుడా చైర్మన్ తుమ్మల రామ స్వామి(బాబు), జూనియర్ విభాగంలో విజేతలకు ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు రంగనాగ్ బహుమతులందజేశారు.

విజేతలు వీరే..

కోనసీమ అంబేడ్కర్ జిల్లా గుమ్మిలేరు కోరా శృతిచౌదరికి చెందిన ఎడ్లు ప్రథమ బహుమతికి ఎంపిక కావడంతో రూ.12 వేలు నగదు, షీల్డ్.. కాకినాడ జిల్లా ధర్మవరం జువ్వల సత్తిబాబుకు చెందిన ఎడ్లుకు ద్వితీయ బహుమతిగా రూ.10 వేల నగదు, షీల్డ్.. తృతీయ బహుమతిగా కోనసీమ జిల్లా గుమ్మిలేరు కోరా శృతిచౌదరికి చెందిన ఎడ్లకు రూ.8వేల నగదు, షీల్డ్ బహుమతులను అందజేశారు. జూనియర్స్ విభాగంలో కాకినాడ జిల్లా సామర్లకోట పాలచర్ల కళ్యాణ్ కుమార్‌కు చెందిన ఎడ్లు ప్రథమ బహుమతిగా రూ.10 వేల నగదు, షీల్డ్.. ద్వితీయ బహుమతిగా కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కాపవరం కుంచం మనోజ్‌కు చెందిన ఎడ్లకు రూ.8 వేల నగదు, షీల్డ్.. తృతీయ బహుమతిగా కాకినాడ జిల్లా కోవ్వాడ మట్టా నవనీత్ శ్రీమణికంఠకు చెందిన ఎడ్లకు రూ.6 వేల నగదు, షీల్డ్ బహుమతులను అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా యన మల కృష్ణ, చేకూరి రామకృష్ణ, కంటే ఫణి కుమార్ వ్యవహరించారు.

మాటామాటా పెరిగి.. ఇటుక ముక్కలతో కొట్టుకుని!

అత్తాకోడళ్లు ఘర్షణ

గాయాలతో ఆసుపత్రిలో చేరిక

ద్రాక్షారామ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం కందులపాలెంలో శనివారం అత్తాకోడళ్ల మధ్య వాగ్వాదంతో పరస్పరం దాడి చేసుకోవడంతో ఇద్దరు గాయపడ్డారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో శనివారం రాత్రి ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొడ్డు ఉమామహేశ్వరి తన భర్తను వదిలివేసి వేరే వివాహం చేసుకుని కాకినాడలో నివాసం ఉంటుంది. ఆమె అత్త బొడ్డు సత్యవతి కందులపాలెంలో నివసిస్తుంది. ఉమామహేశ్వరి శనివారం తన అత్త సత్యవతి ఇంటికి వచ్చి బంగారు నగలపై అత్తను ప్రశ్నించింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఇటుక ముక్కలతో దాడి చేసుకోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేరారు. ద్రాక్షారామ అదనపు ఎస్ఐ భుజంగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'లోవ'లో భక్తుల కోలాహలం

రూ.4.39 లక్షల ఆదాయం

తుని రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం కాకినాడ జిల్లా తుని మండలంలో గల తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో క్యూలైన్‌లు కిక్కిరిశాయి. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకుని భోజనాలు చేశారు. ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.4.39 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధ్‌రాజు తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భారీ బండి..బాగుందండి!



పరిశ్రమల్లో వినియోగించే బాయిలర్‌ను మోసుకెళ్తూ తుని జాతీయ రహదారిపై ఓ భారీ ట్రాలీ వాహనం ఇలా కనిపించింది. -తుని రూరల్

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పిఠాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పట్టణంలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. టీటీడీ వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శ్రీపుష్పయాగం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలు, పండ్లతో అలంకరించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సందీప్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సభా ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, నాయకులు

జనసేన ఆవిర్భావ సభ ప్రాంగణం పరిశుభ్రం

పిఠాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రాడ శివారులో జరిగిన జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవ సభా ప్రాంగణాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ఆధ్వర్యంలో నాయకులు, జన సైనికులు, వీర మహిళలు శుభ్రం చేశారు. ఇప్పటికే సభా ప్రాంగణం, బయట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల తొలగింపును ప్రారంభించారు. కొన్ని రోజుల పాటు నిరంతరాయంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కడారి తమ్మయ్యనాయుడు, పిల్లా శివశంకర్, చల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అనాథ ఆశ్రమానికి వాషింగ్ మెషీన్, నిత్యావసరాలు అందజేస్తున్న కెనరా బ్యాంకు ఉద్యోగులు

కెనరా బ్యాంక్ ఉద్యోగుల సమాజ సేవ

కాకినాడ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంక్ ఉద్యోగుల సంఘ సర్వసభ్య సమావేశం కాకినాడలోని సంఘ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి యూవీవీఎస్ హరివర్మ, రాష్ట్ర చైర్మన్ బి.సంజయ్‌రామ్ హాజరుకాగా 43 శాఖల సభ్యులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. అనంతరం సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా కాకినాడ ఎల్బీ నగర్‌లోని అనాథ ఆశ్రమ సేవా సమితికి వాషింగ్‌మెషీన్, నిత్యావసర వస్తువులు, పండ్లు అందజేశారు. బ్యాంక్‌లో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేసి ఇటీవల మరణించిన ఉద్యోగి తల్లికి రూ.65వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి సంబంధిత బాండును సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.అరుణ అందజేశారు. కార్యక్రమంలో సంఘ సహాయ కార్యదర్శి శ్రీధర్, సభ్యులు రాంబాబు, గణేష్, దుర్గారామ్, సూర్యబ్రహ్మం పాల్గొన్నారు.

గ్రూప్-సి పోస్టల్ అసోసియేషన్ నూతన కార్యవర్గమిదే



నూతన కార్యవర్గ సభ్యులు

కాకినాడ సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ పోస్టల్ అసోసియేషన్ కాకినాడ గ్రూప్-సి నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం కాస్మోపోలిటన్ క్లబ్ సమావేశ మందిరంలో గ్రూప్-సి సర్కిల్ కార్యదర్శి వెంకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి బీఎంఎల్ ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో కొత్తగా వస్తున్న పథకాలు, సాంకేతిక మార్పులపై చర్చతో పాటు ఏపీ సర్కిల్ లెవెల్ సెమినార్ నిర్వహించారు. విశాఖపట్నం రీజనల్ గ్రూప్-సి డివిజనల్ రిప్రజెంటేటివ్‌గా కె.సత్తిబాబు, సూపర్‌వైజర్ అసోసియేషన్ రీజనల్ రిప్రజెంటేటివ్‌గా పీఆర్ వెంకటేశ్వరరావు, కాకినాడ గ్రూప్-సి అధ్యక్షుడిగా టి.జగదీష్, కార్యదర్శిగా బి.అప్పారావు, కోశాధికారిగా ఒ.సత్యనారాయణలను ఎన్నుకున్నారు. సమావేశంలో ఏపీ సర్కిల్ పరిధిలోని కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటేష్, కె.బ్రహ్మానందరెడ్డి, పీఆర్వీ రావు పాల్గొన్నారు.

విజయజనార్దనాచార్యులుకు 'అర్చకసేవ వైభవరత్న' అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న విజయజనార్దనాచార్యులు

పిఠాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానం అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులు అర్చకసేవ వైభవరత్న అవార్డు అందుకున్నారు. హైదరాబాదులోని హరిహర కళాభవన్‌లో సర్ సీవీ రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 33వ ఉగాది వేడుకల ప్రారంభోత్సవంలో విజయజనార్దనా చార్యులు సువర్ణఘంటా కంకణం, బంగారు పతకాన్ని సంస్థ ప్రధాన కార్యదర్శి మహేంద్రవాడ వెంకటేశ్వరరావు, ప్రముఖ నటుడు కోట శంకరరావు ప్రదానం చేశారు.

'మత్స్యకారులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం'



టీడీపీ కార్యాలయంలో మత్స్యకారులనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా మత్స్యకారులకు వేట విరామ సమయంలో రూ.20వేల భృతి (పరిహారం)గా అందించనున్నదని చెప్పారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం మత్స్యకారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మత్స్యకారులను పట్టించుకోలేదన్నారు. మత్స్యకారులకు ఎల్లప్పుడు అండగా ఉండేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని చెప్పారు. టీడీపీ హయాంలోనే ఉప్పాడ హార్బర్ మంజూరైందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం దాని నిర్మాణం గురించి పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వంలో పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, మాజీ జడ్పీటీసీ బత్తుల చైతన్య రాజేష్ పాల్గొన్నారు.

సాగర తీరంలో సందర్శకుల ఆనందహేల

సర్పవరం జంక్షన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. చిన్నారులు ఇసుకలో ఆట, పాటలతో సందడి చేశారు. యువకులు, పెద్దలు సముద్ర స్నానాలు ఆచరించి ఉత్సాహంగా గడిపారు. కాకినాడ మెరైన్ సీఐ రామ్మోహన్ ఆదేశాలతో ఏఎస్ఐ మధు ఆధ్వర్యంలో సిబ్బంది యువతీ, యువకులను సముద్రం లోపలికి వెళ్లకుండా అప్రమత్తం చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తిమ్మాపురం పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు.



సూర్యారావుపేట సముద్ర తీరంలో సందర్శకుల సందడి.





సామర్లకోటలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, పెద్దాపురంలో అమరజీవికి కౌన్సిలర్ రాజశేఖర్ నివాళి

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు



గొల్లప్రోలులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు

సామర్లకోట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. మఠం సెంటర్లోని అమరజీవి విగ్రహానికి శనివారం ఆయన పుష్పమాల వేసి నివాళులర్పించారు. అమరజీవి ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వాసవి వనిత క్లబ్, కపుల్స్ భీమేశ్వర క్లబ్ ప్రతినిధులు కంచర్ల సుష్మామోహిని, కంచర్ల కుమారి, కంచర్ల లలిత, కేఎల్ఎన్‌జీపీ పవన్‌కుమార్, దొంతుల సుధీర్‌కుమార్, నేతి కుమార్ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కటకం రత్నకుమారి, కటకం హైమావతి తది తరులు పాల్గొన్నారు. అమరజీవికి ఎంపీడీవో హిమమహేశ్వరి, తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు సత్తిబాబు, ఎంఈవో శివరామకృష్ణయ్య, ఎంఏవో ఐ.సత్య, నిర్మలా కుమారి, పంచాయతీరాజ్ డీఈ రామకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు నివాళులర్పించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): స్థానిక సినిమా సెంటర్లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్‌తో పాటు పలువురు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమంచి పాపారావు, ఉపాధ్యక్షుడు గొల్లపూడి సాయిచలమయ్య, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఊర శ్రీనివాసరావు, సుబ్బారావు, కేదారిశెట్టి నానాజీ, దంగేటి శ్రీరామకృష్ణ, యు.అప్పలరాజు, గ్రంధి లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



ఐఏఎస్ వెంకటేష్‌కు ఆశీర్వచనం ఇస్తున్న వేద పండితులు

ఐఏఎస్ వెంకటేష్ పూజలు

సామర్లకోట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేష్ ఆదివారం సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయానికి విచ్చేశారు. ఆయనకు ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సాదర స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామికి అభిషేకం, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన జరిపారు. వెంకటేష్‌కు పండితులు వేదాశీర్వచనం ఇవ్వగా ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను ఈవో అందజేశారు.



పిఠాపురం పట్టణ శివారులో కలుసుకున్న ఐటీఐ 1974-76 బ్యాచ్ విద్యార్థులు

ఐదు దశాబ్దాల తర్వాత ఆత్మీయ కలయిక

పిఠాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వారం తా కలిసి చదువుకున్నారు. ఐదు దశాబ్దాల ద్వారా పిఠాపురంలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాల్లోకి వెళ్లి సరదాగా గడిపారు. తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం ఐటీఐలో 1974-76 మధ్య కలిసి చదువుకున్న విద్యార్థులంతా పిఠాపురం పట్టణ శివారు రాపర్తి రోడ్డులోని ఫామ్‌హౌస్‌లో ఆదివారం కలుసుకున్నారు. నాటి సంగతులు, కుటుంబాల క్షేమ సమాచారాలు, ఇతర విషయాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. పిఠాపురం పట్టణానికి చెందిన కసిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మధురం, మధురం మన ఆత్మీయబంధం పేరుతో ఈ అపూర్వ కలయిక జరిగింది. స్వర్ణోత్సవ సందడికి మూడేళ్లు కష్టపడి అందరి చిరునామాలు సేకరించినట్టు నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఐటీఐ బ్యాచ్‌లో ఎక్కువ మంది సింగరేణి సంస్థలో ఉద్యోగాలు చేస్తున్నారు.

ప్రైవేటు పాఠశాల నిర్వహణతో పంచాయతీ ఆదాయానికి గండి

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఎంఈవోకు ఎంపీపీ ఆదేశం



సామర్లకోట మండల సమావేశంలో ఎంఈవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ సత్తిబాబు

సామర్లకోట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబ్రహ్మదేవంలో దశాబ్ద కాలంగా ప్రైవేట్ ఉన్నత పాఠశాల నిర్వహిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తూ పంచాయతీకి పన్నుల రూపేణా ఒక్క రూపాయి కూడా చెల్లించని యాజమాన్యంపై సత్వరం చర్యలు తీసుకోవాలని ఎంఈవో శివరామకృష్ణయ్యను ఎంపీపీ బి.సత్తిబాబు కోరారు. సామర్లకోట మండల పరిషత్ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగింది. విద్యా శాఖ ప్రగతిని వివరిస్తున్న ఎంఈవోపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ గ్రామ ఎంపీటీసీ రెండేళ్లుగా ఫిర్యాదు చేస్తున్నారని, ఉన్నతాధికారులు పాఠశాలకు ప్రస్తుత విద్యా సంవత్సరానికి మాత్రమే అనుమతి ఇచ్చారన్నారు. రానున్న ఏడాది పంచాయతీకి పన్ను చెల్లించకపోతే పాఠశాల నిర్వహణను నిరోధించాలని ఎంపీపీ ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎంఈవో స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ ప్రగతిని ఎంఏవో ఐ.సత్య, వైద్య, ఆరోగ్యంపై డాక్టర్ పార్వతీష్, రెవెన్యూ శాఖ గురించి తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి వివరించారు. ఎంపీడీవో హిమమహేశ్వరి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్టాల్‌ని ప్రారంభిస్తున్న శిల్పారామం చైర్‌పర్సన్ మంజులరెడ్డి

శిల్పారామం అభివృద్ధికి చర్యలు

సర్పవరం జంక్షన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ, ప్రాచీన, హస్త కళలను ప్రోత్సహించి, ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తూ ప్రసిద్ధ శిల్పాకళా కేంద్రంగా కాకినాడ శిల్పారామం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు శిల్పారామం చైర్‌పర్సన్ సి.మంజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆమె కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లో ఉన్న శిల్పారామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు విలేజ్ మ్యూజియం, బోట్ రైడింగ్, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు యోచిస్తున్నామన్నారు. జానూస్ వాటర్ ల్యాండ్‌తో పాటు పలు ప్రదేశాలను సందర్శించి, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మోహజతేజకు సూచనలు చేశారు.

ఐటీఐ విద్యార్థులకు బహుమతులు



అవార్డులు అందుకున్న విద్యార్థులు

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 54వ జాతీయ భద్రతా వారోత్స వాల సందర్భంగా వివిధ కంపెనీలు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో (డ్రాయింగ్, వ్యాసరచన, భద్రత స్లోగన్స్) ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు తొమ్మిది మంది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారికి మంత్రి వాసంశెట్టి సుభాష్, ట్రైనీ కలెక్టర్ భావన, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చంద్రశేఖర్‌వర్మ, రాధాకృష్ణ బహుమతులు ప్రదానం చేశారు.

వ్యాన్‌లో తరలిస్తున్న పశు మాంసం స్వాధీనం

గొల్లప్రోలు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారు పాత వజ్రకూటం నుంచి పశుమాంసాన్ని వ్యాన్‌లో తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున తనిఖీలు చేపట్టారు. ఆపకుండా వెళ్లిపోతున్న వ్యాన్‌ను ఎస్ఐ వెంబడించి పట్టుకున్నారు. అందులో ఉన్న 1017 కిలోల పశుమాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. మాంసాన్ని తరలిస్తున్న చెందుర్తి గ్రామానికి చెందిన మిరియాల రమేష్, ఆరుగుళ్ల తాతీలు, గండేటి రఘులను అదుపులోకి తీసుకున్నారు. వారిని ప్రశ్నించగా పాత వజ్రకూటం శివారులో పశువులను వధించి మాంసాన్ని హైవే ప్రాంతాల్లో హోటళ్లకు అమ్మడానికి తీసుకెళ్తున్నట్టు తెలిపారు. పశు మాంసాన్ని స్వాధీనం చేసుకుని వీఆర్వో పద్మశేఖర్ సమక్షంలో పూడ్చివేశారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మండలాల వారీగా సౌండ్ సిస్టమ్ సంక్షేమ సంఘం సమావేశాలు

కాకినాడ సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సభ్యుల సంక్షేమం కోసం భవిష్యత్తులో ఏమి చేస్తే బాగుంటుందో కార్యాచరణ రూపొందించేందుకు మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నట్టు కాకినాడ జిల్లా సౌండ్ సిస్టమ్ ఓనర్స్, హెల్పర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడికట్ల లోవరాజు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన తమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో మండలాల వారీగా సౌండ్ సిస్టమ్ ఓనర్లు, హెల్పర్లు, ఆపరేటర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఉప్పాడ-కొత్తపల్లి మండలంలోని పీవీఎస్ కల్యాణ మండపంలో, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు కోటనందూరు మండలంలోని నూకాలమ్మ గుడి వద్ద సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. సభ్యులు తప్పక హాజరు కావాలని లోవరాజు కోరారు.

'పది' పరీక్షలను ప్రశాంతంగా రాయాలి

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు



కాకినాడ సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రణాళికాబద్ధంగా, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఎక్కువ ఒత్తిడి చేయరా దన్నారు. నిర్దేశిత సమయానికి అర గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. విజయవంతంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని ఎంపీ ఆకాంక్షించారు.



నూకాలమ్మ పూల గరగ ఉత్సవం

పెద్దాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాండ్రకోటలో నూకాలమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని పూల గరగ ఉత్సవాన్ని కార్యనిర్వాహణాధికారి సౌజన్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ గరగలను ఊరేగించారు.

పాడా కార్యాలయంలో నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పిఠాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల మునిసిపల్ అతిథిగృహం ఆవరణలోని పాడా కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలు, వినతులను పీజీఆర్ఎస్‌లో అందజేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె స్పష్టం చేశారు.

కార్మిక నేత సూర్యారావుకు నివాళి

సర్పవరం జంక్షన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ వలసపాకల సుందరయ్యకాలనీలో ఆదివారం కార్మిక నేత వాసంశెట్టి సూర్యారావు 6వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం రూరల్ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చింతపల్లి అజయ్‌కుమార్, సీఐటీయూ రూరల్ కార్యదర్శి టి.రాజా, సత్యనారాయణ, రాంబాబు, సంగీతరావు, నూకరాజు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

'రోగ నిరోధక శక్తిని పెంచేందుకు టీకాలు దోహదం'

సర్పవరం జంక్షన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోగ నిరోధక శక్తి పెంచి ఆరోగ్యంగా జీవించేందుకు టీకాలు ఉపయోగపడతాయని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ తెలిపారు. జాతీయ టీకాల దినోత్సవం సందర్భంగా ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రస్ట్ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, కుమార యాదవ్, సీహెచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నవరలో మహాన్నదానం

సామర్లకోట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నవర గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన మహాన్నదానాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం ప్రారంభించారు. తొలుత ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గొంచాల, నవర, పి.వేమవరం గ్రామాలకు చెందిన నాలుగువేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

'ఆశా వర్కర్లపై ఆరోపణలు తగదు'

గొల్లప్రోలు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు పనిచేయడం లేదంటూ గొల్లప్రోలు మండల పరిషత్ సమావేశంలో కొందరు ప్రజాప్రతినిధులు అసత్య ఆరోపణలు చేయడం తగదని సీఐటీయూ మండల కార్యదర్శి నందీశ్వరుడు, ఆశా వర్క ర్ల యూనియన్ ప్రతినిధులు వడ్డి వెంకటలక్ష్మి, ములగపాటి ఇందిర అన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లు అందరూ సక్రమంగానే పనిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పని ఒత్తిడి ఎక్కువై పలువురు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు.

పేదలకు బియ్యం, కూరగాయలు పంపిణీ

పిఠాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్గయ్యచెరువులో ఒయాసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద వితంతువులకు బియ్యం, కాయగూరలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ బి.హరిబాబు, పాస్టర్ వి.యేసురత్నం, గంధం నాగేశ్వరరావు పాల్గొన్న కార్యక్రమంలో మేక ఉమ, బూర వరలక్ష్మి, సూర్యుడు, హరిబాబు తదితరులు ఆర్థిక సహకారం అందజేశారు.

పది విద్యార్థులకు ఉపకరణాలు అందజేత

శంఖవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పరీక్షా ఉపకరణాలను బీసీసీ నియోజకవర్గ అధ్యక్షుడు గునపర్తి అపురూప్ అందజేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్‌నగర్ సామాజిక భవనంలో వీటిని అందజేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించ దండ్వారానే తరువాతతరాలు ఉన్నతస్థితికి చేరుకుంటాయన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన శ్రీరాములు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించిన ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఐటీడీఏ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు దేశ స్వాతంత్ర్యం కోసం క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. తెలుగు రాష్ట్రం కోసం, తమిళుల నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా 58రోజులు నిరాహార దీక్ష చేశారన్నారు. పొట్టి శ్రీరాములను తెలుగు ప్రజలు స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, పీహెచ్‌వో చిట్టిబాబు, డీఈ చైతన్య, ఐటీడీఏ కార్యాలయ సిబ్బంది రాజారెడ్డి, పి.వెంకటేశ్వరరావు, బి.రాజు, పి.భీమిరెడ్డి, పి.లక్ష్మిరెడ్డి, శివ, శ్రీకాంత్, బి.మార్గదర్శి గణేశ్వరరావు, చెదల సోమిరెడ్డి, కత్తుల సోమిరెడ్డి, అప్పల స్వామి, నూకరాజు, నాగరాజు, శోభన్‌బాబు పాల్గొన్నారు.

అగ్రవర్ణ బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దు



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

దేవీపట్నం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణ బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లంశేఖర్ డిమాండ్ చేశారు. మండలంలోని ఇందుకూరు 1లో జరిగిన సమావేశంలో ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే విధానాలవల్ల ఆదివాసీ హక్కులు, చట్టాలకు రక్షణ లేకుండాపోతుందన్నారు. పార్లమెంటులో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కోడిపందాలు

మారేడుమిల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో కోడిపందాలు, పేకాట జోరుగా నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఇటీవల జరిగిన గ్రామదేవతల పండుగ పురస్కరించుకుని గ్రామాల్లో పెద్దఎత్తున కోడిపందాలు, పేకాట, చిత్తులాట వంటి జూదాలు నిర్వహిస్తున్నారు. ఆరుగాలం రైతులు పండించిన పంట సొమ్ములను ఆయా జూదాల్లో యువకులు పోగొట్టుకోవడంతో కుటుంబ సభ్యులు సైతం ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగాదొరచింతలపాలెం పంచాయతీ నర్సాపురం గ్రామంలో పెద్దఎత్తున కోడిపందాలు, పేకాట జరుగుతున్న నియంత్రించాల్సి అధికారులు పట్టించుకోకుండా చూసీ చూడనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

వైద్యశిబిరంలో 400 మందికి వైద్యసేవలు



వైద్యసేవలు పర్యవేక్షిస్తున్న మేనేజర్ రఘువీరనంద మహరాజ్

రంపచోడవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రామకృష్ణమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందలపాడులో ప్రత్యేక వైద్య శిబిరంలో 400 మందికి వైద్యసేవలు అందించినట్టు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహరాజ్ తెలిపారు. వైద్యసేవలను రామకృష్ణ మిషన్ మేనేజర్ రఘువీర నంద మహరాజ్ పర్యవేక్షించారు. వైద్య శిబిరంలో 118 మందికి రక్త పరీక్షలు, 12 మందికి థైరాయిడ్, నలుగురికి ఈసీజీలు, 10మందికి ఎక్స్‌రేలు, ఐదుగురికి ఫిజియోథెరపీ చేసినట్టు తెలిపారు. 78మందికి కంటి పరీక్షలు నిర్వహించి 32 మందికి కళ్ళజోళ్లు అందజేశారు. అనంతరం రోగు లు, సహాయకులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు జీ.వి.రామారావు, కస్తూరి సుబ్రమణ్యం, శ్రీకృష్ణ పాతూరి, టి.వి.సుబ్బారా వు, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్‌కుమార్, క్యాంపు కోఆర్డినేటర్ కాను మోను శ్రీనివాస్, వలంటీర్లు ఎల్.జీ.బి. భగీరధరాజు, చంద్రరావు, మంగిరెడ్డి, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

పాపికొండలకు వెళ్లిన నాలుగు బోట్లు

దేవీపట్నం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పాపికొండలు వీక్షించేందుకు ఆదివారం నాలుగు బోట్లలో సుమారు 230మంది పర్యాటకులు పాపికొండలు వెళ్లారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని అనంతరం గోదావరి ముంపు పరీవాహక ప్రాంతాలైన దేవీపట్నం, పూడిపల్లి, మంటూరు, కొండమొదలు తదితర గ్రా మాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లి సందడి చేశారు.

గండిపోశమ్మను దర్శించుకున్న భక్తులు

స్వయంభు మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. వేకువ జామునే ఆలయానికి చేరుకుని గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురి అరెస్టు



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు

రంపచోడవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ సూపరింటెండెంట్ సి.మధుబాబు ఆదేశాల మేరకు ఆదివారం అడ్డతీగల మండలం కొట్టంపాలెంలో దాడులు నిర్వహించి సారాతో ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. వారి వద్ద నుంచి 50 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. 3200 బెల్లపు ఊటను ధ్వంసం చేసి 4 కేజీల ఈస్ట్, ట్యూవీలర్ వాహనాన్ని సీజ్ చేసినట్టు తెలిపారు.

మద్యం పట్టివేత

దేవీపట్నం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగు లూరు పునరావాస కాలనీలో అక్రమంగా మద్యం అమ్ముతుండగా దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ సమాచారం వచ్చింది. వెంటనే ఆయన సిబ్బందితో తనిఖీలు చేయగా ఎనిమిది బీరు బాటిళ్లు, 12 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మద్యంతో వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేత

రాజవొమ్మంగి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాగరాయి గ్రామానికి చెందిన పాము అప్పారావు తాటాకిల్లు ప్రమాదవశాత్తూ శనివారం రాత్రి దగ్ధమైంది. గ్రామస్తులు మంటలు అదుపుచేశారు. ప్రమాదంలో విలువైన వస్తువులన్నీ కాలిపోయాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ ఘనలక్ష్మి ఆ కుటుంబానికి సాయం అందించారు. తాటాకు ఇళ్లల్లో విలువైన సామాగ్రి ఉంచవద్దని వీఆర్వో ప్రజలకు సూచించారు.



అగ్నిప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న దృశ్యం

ధర్మవరంలో దాహం..దాహం

- పాత ట్యాంక్ పనిచేయదు.. కొత్త ట్యాంక్ ప్రారంభించరు..
- హ్యాండ్ పైపులు, పైపులైన్‌లకు మరమ్మతులు
- ఉత్సవ విగ్రహంలా మంచినీటి పథకం
- పట్టించుకోని నాయకులు, అధికారులు



ధర్మవరంలో శిథిలావస్థలోలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్

ప్రత్తిపాడు, మార్చి16 (ఆంధ్రజ్యోతి): పాత ట్యాంక్ సక్రమంగా పనిచేయదు కొత్త ట్యాంక్ ప్రారంభోత్సవానికి నోచుకోదు. 25 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన అండర్ గ్రౌడ్ తాగునీటి పైపులైన్ సిస్టం అస్తవ్యస్తం. పైపలైన్‌లు, హ్యాండ్‌బోర్లు మరమ్మతులతో ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామం వేసవి ప్రారంభంలోనే తీవ్ర మంచినీటి ఎద్దడి ఎదుర్కొంటుంది. గ్రామంలోని నూకాలమ్మగుడి సమీపంలో 25 ఏళ్ల క్రితం నిర్వహించిన లక్ష లీటర్ల సామర్థ్య కలిగిన ఓవర్‌హెడ్ మంచినీటి పథకం ప్ర స్తుతం శిథిలావస్థకు చేరింది. పైపులైన్లు కూడా మరమ్మతులకు గురై సక్రమంగా తా గునీటిని అందించలేక పోయింది. గ్రామ తాగునీటి అవసరాల దృష్ట్యా మూడేళ్లక్రితం పాత ట్యాంక్ సమీపంలోనే మరో లక్ష లీటర్ల సామర్థ్యంగల ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. అయితే దీనికి బోరు తవ్వడం, మోటార్ ఏర్పా టు చేయక పోవడంవల్ల మూడేళ్లుగా రక్షిత మంచినీటి పథకం ఉత్సవ విగ్రహంలా మారింది. దీనికి తోడు గంగాలమ్మ గుడి గ్రామంలో పలుచోట్ల హ్యాండ్ బోర్లు కూడా నెలలు తరబడి మరమ్మతులకుగురై పనిచేయడం లేదు. వెంకట్రావు చెరువువద్ద ఉన్న జీఎల్ఆర్ ట్యాంక్ మోటార్ పనిచేయకపోవడంవల్ల ఈ ట్యాంక్ కు గడిచిన నెలరోజులుగా నీటిసరఫ రా చేయడంలేదు. దీంతో గ్రామంలో తీవ్ర మంచినీటి సమస్య నెలకొంది. పాత ఓవర్ హెడ్ ట్యాంక్‌కు చెందిన అండర్‌గ్రౌండ్ పైపలైన్ ఎక్కడికక్కడే శిథిలమై లీకేజీలు ఏర్పడటంతో వాటికి మరమ్మతులు చేసినా నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. ఈ అండర్ గ్రౌండ్ పైపులైన్ వ్యవస్థను మొత్తం తొలగిస్తేనే నీటి సరఫరా జరిగే పరిస్థితి కొనసాగుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో సొసైటీ వెంకట్రావు చెరువు, ఎలిమెంటరీ ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంత ప్రజలకు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందు లు పడుతున్నారు. దీనిపై ఆర్డబ్ల్యూఎస్, మండలస్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ధర్మవరం వాసు లు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని ట్యాంక్







గంగాలమ్మ గుడి వద్ద మరమ్మతులకు గురైన హ్యాండ్ బోరు, వెంకట్రావు చెరువు వద్ద పని చేయని జీఎల్ఆర్ ట్యాంక్, మరమ్మతులకుగురైన పైపులైన్

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి

జగ్గంపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాడిన మొట్టమొదటి వ్యక్తి పొట్టి శ్రీరాములు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలు జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవీక్లబ్, వనిత క్లబ్, వాసవీ బీటెక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్రకార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు(కొండబాబు), జగ్గంపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు అత్తులూరి నాగబాబు హాజరై పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర, రాష్ట్ర అవతరణ కోసం 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలు అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. అలాగే పొట్టి శ్రీరాములు124వ జయంతి సందర్భంగా జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జ్ తోట నరసింహం ఆదేశాలతో వాసవీ కల్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, టౌన్ అధ్యక్షుడు కాపవరపు ప్రసాద్, జగ్గంపేట నియోజకవర్గ యువత అధ్యక్షుడు నకిరెడ్డి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: పొట్టి శ్రీరాములు జయంతి కిర్లంపూడి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో నిర్వహించారు. జూనియర్ కళాశాల అభివృద్ధి మాజీ కమిటీ చైర్మన్ ఎస్ఎస్ రామ్‌కుమార్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిర్లంపూడి పాత్రికేయులంతా పొట్టిశ్రీరాములకు నివాళులర్పించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో ఆదివారం పొట్టి శ్రీరాముల జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంవద్ద పీసీసీ సభ్యుడు ధర్నాలకోట శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు పలువురు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకుడు నేతి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీకి చెందిన కంది మళ్ళ శామ్యూల్, సూరిబాబు పాల్గొన్నారు.





పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్వీఎస్ అప్పలరాజు తదితరులు, ప్రత్తిపాడులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల దీక్షలు

ఏలేశ్వరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ రమణ 1/2019 సర్క్యులర్‌ను ఉల్లంగించినందుకు జరినామా విధించాలి కానీ సస్పెండ్ చేయాల్సిన అవసరంలేదని ఆదివారం కార్మికులు రిలే నిరాహారదీక్షలు కొనసాగించారు. ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ యూనియన్ సభ్యులు సంయుక్తంగా డిపో గేటువద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. డిపోకు చెందిన రమణను విధుల్లోకి తీసుకునేవరకు ఉద్యమిస్తామన్నారు.

ఆదిత్య రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో బీచ్ క్లీనప్ డ్రైవ్

గండేపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో బీచ్ క్లీనప్ డ్రైవ్ నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, సముద్ర కాలుష్య నివారణ, సామాజిక బాధ్యతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. రోటరాక్ట్ సభ్యులు స్వచ్ఛంద సేవకులు కలిసి తీర ప్రాంతాన్ని శుభ్రం చేశారన్నారు.

దొంగబాబు విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

కిర్లంపూడి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, ప్రజాభిమాని స్వర్గీయ కాళ్ల దొంగబాబు విగ్రహం ఏర్పాట్లకు కిర్లంపూడిలో ఆదివారం శంకుస్థాపన చేశారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆదేశాలతో ఆయన విగ్రహాన్ని తయారు చేయించారు. కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట విగ్రహం నిలిపేందుకు జగపతినగరం గ్రామసర్పంచ్ శ్రీలత రాంబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, నాయకులు ఉన్నారు.

కోడిపందాలపై దాడి

- నలుగురి అరెస్ట్

జగ్గంపేట, మార్చి16 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎస్ఐ రఘునందన్‌రావు, సిబ్బంది మన్యంవారిపాలెంలో కోడిపందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసివారి వద్ద నుంచి రెండు పుంజులు, రెండు కత్తులు, రూ.1020లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. ఎవరైనా కోడిపందాలు, గుండాట, జూదాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి ప్రారంభం

జగ్గంపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలంలో పదో తరగతి పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. మండల వ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాల్లో 1146 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎంఈవో స్వామి తెలిపారు.

రౌతులపూడి: నేటి నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరిక్షలు జరిగే కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవో 2 గాడి కొండబాబు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. రౌతులపూడి, మూలగపూడి, ఎ.మల్లవరం మూడు సెంటర్‌లో 534 మంది పరీక్ష రాయనున్నట్టు తెలిపారు. చీఫ్ సూపరిటెండెంట్ 3, డిపార్ట్‌మెంటల్ అధికారులు 3, ఇన్విజిలేటర్‌లు 35 సిబ్బందిని నియమించినట్టు తెలిపారు.

ఏలేశ్వరంపదోతరగతి పరీక్షలకు మండలంలో 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు మండల విద్యాశాఖాధికారి బి.అబ్బాయి తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్‌లలో 933మంది పరీక్షలకు హాజరవుతారని, సీసీ కెమెరాల పర్య వేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అబ్బాయి, చీఫ్ సూపరింటెండెంట్లు బాచాయ, కళ్యాణ్,నాగరాజు, గణపతిరావు, లక్ష్మీతులసి వెల్లడించారు.



ఏలేశ్వరంలో విద్యార్థుల హాల్ టికెట్ నెంబర్లు అతికిస్తున్న సీఎస్‌లు

కిర్లంపూడి: నేటి నుంచి పదో తరగతి పరీక్షలు మండలంలో ఏడు కేంద్రాల్లో జరుగనున్నాయని ఎంఈవో టి.జోసెఫ్ తెలిపారు. పది పరీక్షలకు సర్వంసిద్ధం చేశామన్నారు. మొత్తం కిర్లంపూడి, గెద్దనాపల్లి, తామరాడ, బూరుగుపూడి, ప్రగతి పాఠశాలలో 1034 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలవద్దసదుపాయాలు కల్పించామన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలంలో పదో తరగతి పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. మండలంలోని మండల వ్యాప్తంగా 5 పరీక్షా కేంద్రాల్లో 935మంది విద్యార్థులు సోమవారం నిర్వహించే టెన్త్ పరీక్షల్లో పాల్గొనే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రత్తిపాడు, ధర్మవరం, లంపకలోవ జడ్పీ హైస్కూల్స్, ఒమ్మంగి జడ్పీ హైస్కూల్‌లో రెండు పరీక్షా కేంద్రాలఏర్పాటు చేశామని ఎంఈవో రాజబాబు తెలిపారు.

అంధ విద్యార్థికి ఉపాధ్యాయుడి ఆర్థిక సాయం

కోటనందూరు, మార్చి16 (ఆంధ్రజ్యోతి): అంధ విద్యార్థి చదువు పూర్తయి ఉద్యోగంలో చేరేవరకు ఆర్థిక సహాయం చేసేందుకు ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ముందుకు వచ్చాడు. కోటనందూరు మండలం బిళ్లనందూరు గ్రామంలో ఎంపీయూపీ ప్రభుత్వ పాఠశాలల్లో కె.వెంకట కుసుమదేవి ఆరవ తరగతి చదువుతుంది. బంగారయ్యపేట గ్రామానికి చెందిన ఆ విద్యార్థిని అంధురాలు. కోటనందూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దాడి కొండబాబు డిప్యూటేషన్‌పై ఆ పాఠశాలకు వెళ్లాడు. అక్కడ అంధ విద్యార్థిని గుర్తించి ఉన్నత చదువులు చదివించి ఉద్యోగం సాధించే వరకు ఆర్థిక సాయం చేసి అండగా నిలుస్తానని తెలిపారు. ఆమేరకు తల్లిదండ్రులకు తెలిపారు. బ్రెయిలీ లిపి నేర్చుకోవడానికి కావలసిన బ్రెయిలీ స్లేట్, స్టైలస్, మెటీరియల్ అందించారు. కోటనందూరులోగల భరోసా కేంద్రం సిబ్బంది నారాయణరావు, మరికొంతమంది బ్రెయిలీ లిపి నిపుణుల సహకారంతో కొండబాబు మాస్టారు మాష్టారు బోధన బాధ్యతలను నిర్వహిస్తూ అదనంగా అందుకు అవసరమైన లిపిని బోధిస్తున్నారు. కొండబాబు మాస్టారును ఎంఈవోలు శ్రీనివాస్, రామ్‌శేఖర్, యర్ర శేఖర్ అభినందించారు.



అంధ విద్యార్థికి సాయం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

శివాలయానికి శంకుస్థాపన

శంఖవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి కృష్ణుడి గుడివద్ద ఊరచెరువులో గ్రామస్థుల సహకారంతో నూతనంగా నిర్మించే శివాలయానికి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితులు విశేషకరమైన పూజలు నిర్వహించి పనులు ప్రారంభానికి అంకురార్పణ చేశారు.



రాజులుబాబు పండుగలో భోజనాలు చేస్తున్న భక్తులు

ఘనంగా కొండరాజులు బాబు పండుగ

గండేపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో మల్లేపల్లి గ్రామ శివారులో గ్రామానికి చెందిన భక్తులు గొల్లపల్లి వీరబాబు జీడిమామిడితోటలో ఆదివారం కొండరాజులుబాబు పండుగ ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజులుబాబుకు పూజలుచేసి నైవేద్యం సమర్పించి అనంతరం భారీసంఖ్యలో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో జాజిమొగ్గల సత్యనారాయణ, పోతుల చంద్రరావు, తెలగరెడ్డి ప్రకాశ్, పోతుల బుజ్జి, చక్రం పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మవారు

గండేపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):మండలంలో మురారి గ్రామ శివారులో వెలిసిన కనకదుర్గమ్మ ఆలయానికిఆదివారం భక్తులతో కిటకిటలాడింది.దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించి ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

పూలగరగల ఊరేగింపు

కిర్లంపూడి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో ఉన్న నూకాలమ్మతల్లి జాతర మహోత్సవాలకు ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలంకరణతో తీర్చిదిద్దుతున్నారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ధర్మకర్తలు ముద్రగడ రాజా, నాయుడు, సురేంద్ర, చిన్నబాబు బ్రదర్స్ ఆధ్వ ర్యంలో విస్తృత ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారి పూలగరగలు తీసి ఊరేగించారు.

ఘనంగా గంగాలమ్మ బోనాలు



బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

రౌతులపూడి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గిడజాం గ్రామంలో వెలిసి యున్న గంగాలమ్మతల్లి బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు నిండు కడవలతో పసుపు నీళ్లను తీసుకుని గ్రామ వీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అభిషేకిం చారు. ఆలయం నిర్మించి రెండు సంవత్సరాలుకాగా ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ ధర్మకర్త పడాల గిరిబాబు ఆధ్వర్యంలో పూజలు నిర్వహిం చారు.

దుర్గామీనాక్షి జన్మనక్షత్ర పూజలు



సీతంపేటలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శంఖవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సీతంపేట గ్రామంలో ఉన్న దుర్గామీనాక్షి అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి సతీష్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయాన్ని అత్యంత సుందరంగా పూలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి పలు విశేషకరమైన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలతోపాటూ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

రామాలయానికి శంకుస్థాపన



రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఏలేశ్వరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైఆర్‌పీ కాలనీలో కోదండ రామాలయం నిర్మాణానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి మానస దంపతులచే పురోహితులు సత్యన్నారాయణ, శ్రీకాంత్‌శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ చేశారు. లింగవరం కాలనీ, లక్కవరం కాలనీలతోపాటు పలు వార్డుల్లో మహిళలు, పెద్దలు, నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జనసేన పార్టీకి విరాళం

ప్రత్తిపాడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):జనసేన పార్టీలో ప్రత్తిపాడు మండలం లంపకలోవకు చెందిన జనసేన నాయకుడు పంది వీర్రాఘవులు(చిట్టిబాబు) రూ.50వేలు విరాళం అందించారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబుకు రూ.50వేలు అందజేసినట్లు చిట్టిబాబు తెలిపారు. ఆదివారం లంపకలోవలో ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీ తరుపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని రాబోయే రోజుల్లో జనసేన పార్టీ తరుపున సామాజిక సేవా కార్యక్రమం చేయనున్నట్లు తెలిపారు.